రాష్ట్రంలో ప్రజాద్రోహి పాలన

- నేను రుణమే తీసుకోలే.. మాఫీ ఎట్ల అయితది ?
- మాజీ ఎమ్మెల్యేకు రుణమాఫీ అయినట్లు తప్పుడు ప్రచారం
- కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఏమయ్యాయి ?
- హామీలు నెరవేర్చలేక బీఆర్ఎస్‌పై విమర్శలు
- మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్
- షాద్‌నగర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి

షాద్‌నగర్ పట్టణంలో నిర్వహించిన బీఆర్ఎస్ ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్, ఆగస్టు22: రాష్ట్రంలో ప్రజాద్రోహి పాలన కొనసాగుతున్నదని రాష్ట్ర ప్రభుత్వంపై మాజీ శాసన సభ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రుణమాఫీని అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును నిరసిస్తూ గురువారం షాద్‌నగర్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్యయాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీఆర్ఎస్ ధర్నా నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వానికి శ్రద్ధలేదని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి అయిన వెంటనే రూ. 2 లక్షల రుణమాఫీపై మొదటి సంతకం ఉంటుందని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి మాటతప్పారని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో రైతుల శ్రేయస్సు కోసం రైతుబంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్, ఎరువులు, విత్తనాలు వంటి ఎన్నో వసతులను కల్పించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కిందని, నేడు రైతులు నిత్యం ఆందోళన చెందే పరిస్థితి నెలకొందని వాపోయారు. రాష్ట్రంలో 47 లక్షల మంది వ్యవసాయ రుణగ్రహీతలు ఉన్నారని చెప్పిన ప్రభుత్వమే తాజా బడ్జెట్‌లో రుణమాఫీకి రూ.17వేల కోట్లు మాత్రమే కేటాయించడాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలని ప్రశ్నించారు.

హామీలు నెరవేర్చకుంటే ఉద్యమిస్తాం

కాంగ్రెస్ పార్టీ నాయకులు అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్యయాదవ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నేను వ్యవసాయ రుణం తీసుకున్నానని, మాజీ ఎమ్మెల్యేకు రుణమాఫీ అయ్యిందని కాంగ్రెస్ నాయకులు చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. నేను రుణమే తీసుకోలేదని.. ఎలా మాఫీ అవుతుందని ఆయన ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక బీఆర్ఎస్ నాయకులను విమర్శిస్తున్నారే తప్పా ప్రజలకు చేస్తున్న సేవ ఏమిటో చెప్పాలని అన్నారు. ఈ నెల 15లోపు అర్హత కలిగిన ప్రతి రైతుకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ అయ్యిందా? అనే విషయాన్ని వివరించాలన్నారు. నేడు రైతు భరోసా, రైతు రుణమాఫీ, వడ్లకు బోనస్ ధర లేదని ఆరోపించారు. రూ. 4వేల పింఛన్లు ఏమయ్యాయని, కల్యాణలక్ష్మి కింద తులం బంగారం ఎక్కడ ఇస్తున్నారని, మహిళలకు రూ. 2500 ఎక్కడా అని ప్రశ్నించారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రూ. 2 లక్షల రుణమాఫీ చేసి తీరాలని, లేనియెడల రైతుల పక్షాన మరింత ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజన్, మాజీ ఎంపీపీ వై. రవీందర్‌యాదవ్, నాయకులు ఈటి గణేశ్, నారాయణరెడ్డి, సత్యనారాయణ, వెంకట్‌రెడ్డి, దేవేందర్‌యాదవ్, రాయికల్ వెంకట్‌రెడ్డి, లక్ష్మీనారాయణగౌడ్, మురళీధర్‌రెడ్డి, బక్కన్నయాదవ్, కృష్ణ, శ్రీధర్‌రెడ్డి, లక్ష్మణ్‌నాయక్, రామకృష్ణ, వెంకట్రాంరెడ్డి, రాజ్యలక్ష్మి, ఉమాదేవి, రవియాదవ్, ప్రతాప్‌రెడ్డి, ఈశ్వర్‌రాజు, నర్సింహ, శంకర్, ఎండీ ఎజాజ్‌అడ్డు, మన్నె నారాయణయాదవ్, భీమారం వీరేశం, జమాల్‌ఖాన్, రామకృష్ణ, రవీందర్‌గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, శంకర్, శేఖర్‌రెడ్డి, విఠల్, రంగయ్యగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, ఎండీ నిజాం, నరేందర్, శరత్‌కుమార్, అశోక్, శ్రీకాంత్, నవీన్‌కుమార్, ఆయా గ్రామాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ రుణమాఫీ చేయాలి



కల్వకుర్తి తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగికి వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, రైతులు

ఆమనగల్లు, ఆగస్టు 22: ప్రతి రైతుకూ రుణమాఫీ చేయాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. గురువారం కల్వకుర్తి పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద రైతులతో కలిసి బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గోళి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి, మంత్రులు పూటకోవిధంగా ప్రకటనలు చేస్తూ రైతులను గందరగోళానికి గురిచేస్తున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికీ 40 శాతం మందికి మాత్రమే రుణమాఫీ అయినట్లు గణాంకాలు చెబుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రతి రైతుకు రుణమాఫీ చేసేలా కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచుతామన్నారు. అంతకు ముందు మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు విజయ్‌గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ షాహిద్, కౌన్సిలర్ సూర్యప్రకాశ్‌రావు, సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు జంగయ్య, మాజీ సర్పంచ్ సుశీల, సురేశ్‌గౌడ్, మనోహర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, భాస్కర్‌రావుతో పాటు కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రైతు ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

నిరంతరం పోరాటం చేస్తాం

షాబాద్, ఆగస్టు 22: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రూ.2లక్షల రుణమాఫీ రైతులందరికీ చేయాలని షాబాద్ మాజీ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. గురువారం చేవెళ్లలో బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు నిర్వహించిన రైతు రుణమాఫీ ధర్నా కార్యక్రమానికి షాబాద్ మండలం నుంచి వాహనాల్లో బీఆర్ఎస్ శ్రేణులు, రైతులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఎలాంటి షరతులు లేకుండా రైతులకు వెంటనే రూ.2లక్షల రుణాలు మాఫీ చేయాలన్నారు. రైతుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు నర్సింగ్‌రావు, చల్లా శ్రీరాంరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, పార్టీ నాయకులు కొలన్ ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఎండీ చాంద్‌పాషా, యాదయ్య, రాజేందర్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, పాండు, రాములు, ముఖ్రంఖాన్, అవిలాశ్ గౌడ్, ఇమ్రాన్, నర్సింహులు, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, పార్టీ కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



చేవెళ్ల రైతు ధర్నాకు తరలివెళ్తున్న మాజీ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులు, రైతులు

షరతుల్లేకుండా రుణమాఫీ చేయాలి

కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల్ మండలాల్లో బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళన

కడ్తాల్, ఆగస్టు 22: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. షరతుల్లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండల కేంద్రాల్లో రైతులతో కలిసి బీఆర్ఎస్ శ్రేణులు రాస్తారోకో, నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ప్రతి రైతుకూ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్లకు నాయకులు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రుణమాఫీ చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందని, రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులే తగిన బుద్ధి చెబుతారన్నారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ పార్టీ కడ్తాల్, తలకొండపల్లి మండలాల అధ్యక్షులు పరమేశ్, శంకర్, మాజీ ఎంపీపీలు శ్రీనివాస్‌యాదవ్, జైపాల్‌యాదవ్, మాజీ జడ్పీటీసీ నర్సింహ, మాజీ వైస్ ఎంపీపీలు ఆనంద్, శంకర్‌నాయక్, మాజీ జడ్పీ కోఆప్షన్ సభ్యుడు ముజీబూర్ రెహ్మాన్, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీ నర్సింహారెడ్డి, గోపాల్‌నాయక్, జ్యోతయ్య, ఈశ్వర్‌నాయక్, శంకర్‌నాయక్, సాయిలు, హరిచంద్‌నాయక్, దేవానాయక్, మాజీ ఎంపీటీసీలు గోపాల్, చంద్రమౌళి, రమేశ్‌నాయక్, నాయకులు వీరయ్య, లాలయ్యగౌడ్, రామకృష్ణ, లాయక్‌అలీ, నర్సింహ, పాండూ నాయక్, రాములుయాదవ్, మహేశ్, శ్రీను, శేఖర్‌యాదవ్, నరోత్తంరెడ్డి, సజ్జుపాషా, రవి, మల్లేశ్, బాలకుమార్‌గౌడ్, శ్యాంసుందర్‌రెడ్డి, రమేశ్, సుధాకర్, జంగయ్య, పర్వతాలు, ఆరోగ్యరెడ్డి, చిన్నయ్య, రాజుగౌడ్, యాదయ్య, అనిల్, చెన్నకేశవులు నారాయ్య, దేవరాజ్, లక్ష్మణ్, చందర్ పాల్గొన్నారు.

తలకొండపల్లి మండల కేంద్రంలో ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అమ్మా బైలెల్లినాదో..

కొత్తూరు/ మంచాల/తుర్కయాంజాల్, ఆగస్టు 22 : కొత్తూరు మున్సిపాలిటీలో పోచమ్మ బోనాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా ఆషాఢ మాసంలో జరిగే బోనాలు గ్రామ దేవతల ఆలయాల పునర్నిర్మాణం నేపథ్యంలో ఈసారి శ్రావణంలో నిర్వహించారు. దీంతో ఆడపడుచులు పెద్ద ఎత్తున బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మున్సిపాలిటీ సీనియర్ నాయకుడు దేవేందర్‌యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలహార బండి ఊరేగింపును మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ప్రారంభించారు. అంతకు ముందు మాథోల్ మైసమ్మ తల్లికి అంజయ్యయాదవ్ పూజలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నర్సింహాగౌడ్, సదానందంగౌడ్, యాదయ్య, శ్రీనివాస్‌గౌడ్, రాఘవేందర్‌యాదవ్, రవీనాయక్, కృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, వెంకటేశ్ గౌడ్ పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలహార బండి ఊరేగింపులో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. అలాగే మంచాల మండలంలోని అస్మత్‌పూర్, తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి బ్రహ్మణపల్లిలోనూ పోచమ్మ బోనాలను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్‌లు హరిప్రసాద్, జగన్, రాధికాగణేశ్ పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

చేవెళ్లలో జరిగిన రైతు ధర్నాలో పాల్గొనేందుకు ర్యాలీగా వస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సబితారెడ్డి

చేవెళ్లలో జరిగిన నిరసనలో పాల్గొన్న యువతి

రుణమాఫీ ఎగవేతపై బీఆర్ఎస్ ఆగ్రహ జ్వాల



తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సబితాఇంద్రారెడ్డి

ఎన్ని కలలు ముందు హామీ ఇచ్చినట్లు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులందరికీ రుణమాఫీ చేయకపోవడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన ఆందోళనకు దిగింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం రంగారెడ్డి జిల్లాలోని నియోజకవర్గాలు, మండల కేంద్రాల్లో రైతులతో కలిసి ధర్నాలు నిర్వహించగా.. అన్నదాతలు స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. చేవెళ్లలో జరిగిన రైతు ధర్నాలో కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. రైతులందరికీ రూ.2 లక్షల వరకు పంట రుణాలను ప్రభుత్వమే మాఫీ చేయడంతోపాటు వడ్డీ కూడా చెల్లించాలని ఈ విషయంలో ప్రభుత్వాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలి పెట్టబోమని హెచ్చరించారు. ఇది కేవలం ఆరంభం మాత్రమేనని.. భవిష్యత్తులో మరింత ఉధృతంగా పోరాటం చేద్దామని రైతులకు పిలుపునిచ్చారు.



రైతుధర్నాలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న రైతులు



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పీచ్‌కు చేతులెత్తి మద్దతు తెలుపుతున్న రైతులు

ర్యాలీగా రైతు ధర్నాలో పాల్గొనేందుకు వస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కార్తీక్‌రెడ్డి, రైతులు

హెడ్ కానిస్టేబుల్ మృతి బాధాకరం

నివాళులర్పించిన డీసీపీ రాజేశ్, నాయకులు

కడ్తాల్, ఆగస్టు 22: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మల్లయ్య బుధవారం అర్ధరాత్రి డ్యూటీలో ఉండగానే గుండెపోటుతో మరణించాడు. ఆయన హఠాన్మరణం దిగ్భ్రాంతికి గురి చేసిందని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డితో పలువురు నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో ఏర్పాటు చేసిన, మల్లయ్య చిత్రపటానికి వివిధ పార్టీల, యువజన సంఘాల నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పరమేశ్, పీఏసీఎస్ డైరెక్టర్ వీరయ్య, మాజీ సర్పంచ్‌లు జీఎల్ఎన్ రెడ్డి, సులోచన, హరిచంద్‌నాయక్, మాజీ ఎంపీటీసీలు గోపాల్, లచ్చిరాంనాయక్, మంజుల, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ లాయక్‌అలీ, మాజీ ఉప సర్పంచ్‌లు రామకృష్ణ, పాండునాయక్, నాయకులు నర్సింహ, యాదయ్య, వెంకటేశ్, జంగయ్య, శ్రీను, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మల్లయ్య కుటుంబాన్ని ఆదుకుంటాం...

హెడ్ కానిస్టేబుల్ మల్లయ్య కుటుంబాన్ని ప్రభుత్వం తరపున అన్ని విధాలా ఆదుకుంటామని శంషాబాద్ డీసీపీ రాజేశ్ అన్నారు. హైదరాబాద్‌లోని అల్మాస్‌గూడలోని ఇంట్లో మల్లయ్య భౌతికకాయానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ మల్లయ్య ఆకస్మికంగా మృతి చెందడం బాధాకరమన్నారు. అనంతరం పోలీస్ లాంఛనలతో నిర్వహించిన అంత్యక్రియల్లో డీసీపీతో పాటు సీఐ శివప్రసాద్, ఎస్ఐ వరప్రసాద్, కడ్తాల్ పోలీసులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు డ్రైవింగ్‌లో శిక్షణ

షాబాద్, ఆగస్టు 22: రంగారెడ్డిజిల్లాలోని షెడ్యూల్డ్ కులాల(ఎస్.సి)నిరుద్యోగ యువకులకు డ్రైవింగ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్,(డి.టి.ఐ), టి.ఎ. జేడ్.ఎస్.టి.సి హకింపేటలో లైట్ మోటర్ వెహికల్, హెవీ మోటర్ వెహికల్ డ్రైవింగ్‌లో శిక్షణ 38 రోజులు పాటు ఇవ్వనున్నట్లు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ తర్వాత పర్మనెంట్ లైసెన్స్ ఇప్పించనున్నట్లు చెప్పారు. భోజన వసతి ఉంటుందన్నారు. ఈ అభ్యర్థులు 20 సంవత్సరాలు పైబడిన వారు అర్హులని చెప్పారు. ఆసక్తి గల యువకులు రంగారెడ్డిజిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎస్-9, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు. కులం, ఆదాయం ధ్రువీకరణ పత్రాల జిరాక్స్, రేషన్ కార్డు(ఫుడ్ సెక్యూరిటీ కార్డు) జిరాక్స్, 3 పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్‌కార్డు జిరాక్స్, హెవీ మోటర్ లైసెన్సు శిక్షణలో చేరేవారు లైట్ మోటర్ డ్రైవింగ్ లైసెన్సు జారీ కాబడి ఒక్క సంవత్సరం కాలం దాటి ఉండాలని, ఈ జిరాక్స్‌లు దరఖాస్తుకు జతచేయాలన్నారు.

ఆదివాసీ చెంచుల సమస్యలను పరిష్కరించాలి

కడ్తాల్, ఆగస్టు 22: ఆదివాసీ చెంచులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని చెంచు సంఘం నాయకులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమం, ఆదివాసీ చెంచు జిల్లా, కడ్తాల్ మండల కార్గవర్గాన్ని ఎన్నుకున్నారు. చెంచు సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా నల్లవోతుల రాములు, ఉపాధ్యక్షుడిగా నల్లవోతుల నర్సింహ, కడ్తాల్ మండలాధ్యక్షుడిగా కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శిగా రమేశ్, ఉపాధ్యక్షుడిగా శ్రీశైలాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను నాయకులు సన్మానించారు. పోడు భూములకు పట్టాలు ఇప్పించేందుకు కృషి చేస్తామని సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చెంచు సంఘం నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పనులు వెంటనే ప్రారంభించాలి

మంచాల, ఆగస్టు 22: ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, వెంటనే పనులను ప్రారంభించాలని మంచాల ఎంపీడీవో బాలశంకర్ అన్నారు. మండలంలోని అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ఎంపికైన 9ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్‌లతో గురువారం మంచాల ఎంపీడీవో కార్యాలయంలో మొదటి విడుత మంజూరైన నిధులపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలకు మంజూరు చేసిన రూ.50వేలతో పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. అదేవిధంగా 2వ విడుత ప్రతి పాఠశాలకు రూ.3నుంచి 4లక్షలు ప్రభుత్వం మంజూరు చేస్తున్నదని, పనులను వేగంగా పూర్తి చేయాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

యాచారం, ఆగస్టు 22 : అక్రమంగా తరలిస్తున్న 60 కిలోల గంజాయిని యాచారం పోలీసులు మాల్ చెక్‌పోస్టు వద్ద గురువారం సాయంత్రం పట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఓ కారులో ఇద్దరు యువకులు గంజాయిని హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. మండలంలోని మాల్‌లో రాచకొండ పోలీసులు ఏర్పాటు చేసిన జిల్లా సరిహద్దు బార్డర్ వద్ద ఆ కారును తనిఖీ చేయగా 60 కిలోల గంజాయి బయటపడింది. దీంతో పోలీసులు దానిని స్వాధీనం చేసుకుని ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను శుక్రవారం మీడియా సమావేశంలో వెల్లడించనున్నట్లు సీఐ శంకర్‌కుమార్ తెలిపారు.